క్లుప్తంగా

దరఖాస్తుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలి

ముప్పాళ్ళ: ఓటు హక్కు కోసం ఈ నెల 9వ తేదీ వరకు అందిన దరఖాస్తుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణల ప్రత్యేక శిబిరంలో చేర్పులు, మార్పులు, సవరణల కోసం గడువులోపు అందించిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ జరపాలని బీఎల్ఓలను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్ఐలు పవన్‌కుమార్, కపిల్‌దేవ్, ఆంజనేయులు, ఆయా గ్రామాల బీఎల్ఓలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి అమానుషం

సత్తెనపల్లి: సచివాలయ ఉద్యోగిపై కౌన్సిలర్ భర్త దాడి చేయడం అమానుషమని వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు సందెపోగు శ్రీనివాసరావు అన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని 29వ వార్డు పరిధిలోని 16వ సచివాలయం వద్ద చోటు చేసుకున్న ఘటనలో కౌన్సిలర్ మునీర భర్త సైదావలి దాడి చేయడంతో సచివాలయ శానిటరీ కార్యదర్శి అశోక్‌కు గాయాలు అయ్యాయన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా, ఉద్యోగులపై దాడులకు పాల్పడే వారి పట్ల కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు షేక్ కరిముల్లా, జిల్లా నాయకులు సైదా, భూలక్ష్మి, ఆర్.గౌరీశంకర్, చిలుకా ప్రదీప్ తదితరులున్నారు.

నిరుపేద విద్యార్థికి లాప్‌టాప్ అందజేత



అచ్చంపేట: నిరుపేద కుటుంబానికి చెందిన బీటెక్ విద్యార్థి తన్నీరు మానసబిందుకు ప్రాజెక్టువర్క్ నిమిత్తం స్నేహహస్తాలు ఫౌండేషన్ వారు ఎంఈవో రావిపాటి నరసింహారావు చేతులమీదుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రూ.40వేలు విలువ చేసే లాప్‌టాప్‌ను అందచేశారు. ఈ సందర్భంగా సంస్థ కో ఆర్డినేటర్ కరిముల్లాబాబు మాట్లాడుతూ మానసబిందు పెనుమాక జెడ్పీహైస్కూలులో టెన్త్ చదివి 570మార్కులు సాధించిందని, అదే గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిందన్నారు. విద్యార్థి ప్రతిభను స్నేహహస్తాలు గుర్తించి లాప్‌టాప్‌ను అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాయక్, మ్యాథ్స్ లెక్చరర్ శివనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై తనిఖీలు



దాచేపల్లి : విద్యుత్‌శాఖ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వ్యక్తులకు అపరాధ రుసుం విధించినట్లు అధికారులు చెప్పారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 43 మంది అధికారులు 86 మంది సిబ్బందితో బృందాలుగా ఏర్పడి దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో 3,977 సర్వీస్‌లను పరిశీలించి అనుమతి లేకుండా విద్యుత్‌ను వాడుతున్న 108 మందికి రూ.5.19లక్షల అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని అధికారులు చెప్పారు. ఈ దాడుల్లో డీఈఈలు ఎం.రవికుమార్, కె.రవికుమార్, టి.సర్వేశ్వరరావు, ఏఈలు కోటేశ్వరరావు, చంద్రశేఖర్, భగవాన్‌నాయక్ పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ తహసీల్దారుగా కల్పనశ్రీ

మాచవరం: మాచవరం ఇండిపెండెంట్ తహసీల్దారుగా పల్నాడు జిల్లా సహాయ కలెక్టర్ కల్పనశ్రీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన తాను శిక్షణలో భాగంగా మాచవరం ఇండిపెండెంట్ తహసీల్దారుగా నియమితులైనట్లు తెలిపారు. ప్రస్తుత తహసీల్దారు ప్రసాద్‌తో కలిసి రెండు వారాల పాటు రెవెన్యూ విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, రెవెన్యూ సమస్యలపై చర్చించారు.

కేసీపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

మాచర్ల: పట్టణంలోని కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఈఎస్ఐ వారు కార్మికులు, సిబ్బందికి కేసీపీ ఆడిటోరియంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. 500 మంది ఉద్యోగులు, కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ జ్యోతి, డాక్టర్ సరిత, డాక్టర్ చంద్రశేఖరరావు, డాక్టర్ పవన్‌కుమార్, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. రూ.లక్ష విలువ చేసే మందులు ఉచితంగా పంపిణీ చేశారు. క్యాంపు కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వెంకటరమణ ప్రారంభించారు. క్యాంపులో డీజీఎం రామకోటేశ్వరరావు, డాక్టర్ రామకోటయ్య, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాసరావు, వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వరరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించుకుందాం.. నవరత్నాలు పొందుదాం

- మండల కన్వీనర్ వెలది అప్పారావు
- 88త్యాళ్లూరు, వైకుంఠపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

88త్యాళ్లూరు(క్రోసూరు): జగనన్నను గెలిపించుకుందాం.. నవరత్నాలను పొందుదామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలోని 88త్యాళ్లూరు సచివాలయం వద్ద నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జగనన్న పాదయాత్ర సందర్భంగా ప్రకటించిన నవరత్నాల హామీలన్నీ పేద ప్రజలను ఆదుకునే సంక్షేమ కార్యక్రమాలని అన్నారు. అధికారం చేపట్టిన కొద్దిరోజుల్లోనే 99 శాతం అమలు చేసిన గొప్ప నేత మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఇచ్చిన హామీలను ఎంత కష్టమైనా అమలు చేసి ప్రజల మన్ననలు పొందటంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. ఈ సందర్భంగా 88త్యాళ్లూరు గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. ప్రజలకు జగన్‌తోనే రాష్ట్రానికి సంక్షేమం, అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, ఎంపీటీసీ పి.కోటయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, సచివాలయ కన్వీనర్ సయ్యద్ అబ్దుల్ రహీం, రవి, ఉయ్యందన సర్పంచ్ మంకు వెంకటేశ్వర్లు, పూర్ణ, ఏసు, సంజీవరావు, శేఖర్, శ్రీను, రాముడు, కుమార్, అప్పిరెడ్డి, కోటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.



వైకుంఠపురంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన నాయకులు

వైకుంఠపురంలో పల్లెకుపోదాం

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం గ్రామ సచివాలయంలో పల్లెకుపోదాం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు ప్రారంభించి సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వైకుంఠపురం గ్రామ సచివాలయ పరిధిలోని వైకుంఠపురం, పెదమద్దూరు గ్రామాలకు రూ.34.71 కోట్ల సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల రూపంలో రూ.1.38 కోట్లు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, గ్రామ ఉపసర్పంచ్ గుబ్బా కృష్ణయ్య, ఈవోపీఆర్డీ గంగాధరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు బాబురావు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేద్దాం

ఎంపీడీవో శివసుబ్రమణ్యం

అచ్చంపేట: గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఉత్సాహవంతులైన క్రీడాకారులను గుర్తించి వారి పేర్లను నమోదు చేయాలన్నారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, ఆటలపై అవగాహన ఉన్న పాఠశాల ఉపాధ్యాయుడు, ముగ్గురు వలంటీర్లు, వారిలో ఒకరు మహిళ ఒక కమిటీగా ఏర్పడి క్రీడా పోటీలను నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. పురుషులకు, మహిళలకు పోటీలు వేర్వేరుగా నిర్వహించి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను మండల స్థాయి పోటీలకు పంపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి వీరస్వామి, స్థానిక జెడ్పీ హైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయిని ఆలపాటి సుజాత, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధక చట్టంపై అవగాహన



మానవ అక్రమ రవాణా నిరోధక చట్టంపై అవగాహన సమావేశం దృశ్యం

అమరావతి: మండల పరిధిలోని 14వ మైలు వీనస్ హైస్కూల్‌లో మంగళవారం మానవ అక్రమ రవాణా నిరోధక చట్టంపై బాలబాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సమావేశంలో నేర విభాగం ఎస్ఐ అల్లూ రెడ్డి బాలబాలికల అక్రమ నిరోధక చట్టం, రాగింగ్, మత్తు పదార్థాలు బానిసత్వం వాటి దుష్పరిణామాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక నిరోధక చట్టం గురించి వివరించారు. అలాగే చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఉన్నా 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కి వెంటనే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేర విభాగం సిబ్బంది మంగమ్మ, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్ నల్లూరి సాంబశివరావు హెచ్‌ఎం రాధాకష్ణ, అకడమిక్ డైరెక్టర్ త్రివేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతిరాత పోటీల్లో వినుకొండ విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): నేషనల్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ హైదరాబాద్ వారు గత నవంబరు నెలలో జాతీయస్థాయిలో నిర్వహించిన హ్యాండ్ రైటింగ్ పోటీల్లో వినుకొండకు చెందిన ఆదిత్య హైస్కూల్ విద్యార్థులు ఆర్.యశ్వంత్, జి.ఆది లక్ష్మి, విద్యావికాస్ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు బత్తుల రాజశ్రీలు బహుమతులు సాధించారు. హైదరాబాద్‌లో జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో ప్రముఖ అంతర్జాతీయ చేతిరాత నిపుణులు వై.మల్లికార్జునరావు, ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను చేతిరాత నిపుణులు సోమేపల్లి వెంకట సీతారామయ్య, పాఠశాల డైరెక్టర్లు వి. రవి, తిరుమలశెట్టి బాలయ్య, చేకూరి ఏడుకొండలు తదితరులు అభినందించారు.

ఆర్టీసీ గ్యారేజ్ ఆకస్మిక తనిఖీ



కండక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న ఆర్టీసీ సీఎంఈ శ్రీనివాసరావు, డీఎం జీఎస్‌వీవీ కుమార్

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజిలో జోన్-3 డిప్యూటీ సీఎంఈ ఎస్.శ్రీనివాసరావు ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా గ్యారేజిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యారేజి సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. అనంతరం తిరుపతిలో ఇటీవల జరిగిన 42వ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పట్టణంలోని ఆర్టీసీ డిపో కండక్టర్ జి.శ్రీనివాసరెడ్డి పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కై వసం చేసుకుని ప్రతిభ కనబరిచాడు. ప్రతిభ చూపిన కండక్టర్ శ్రీనివాసరెడ్డిని ప్రత్యేకంగా సీఎంఈ శ్రీనివాసరావు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్, గ్యారేజ్, డిపో సిబ్బంది, ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సామగ్రి అందజేత



సచివాలయ సిబ్బందికి క్రీడా సామగ్రిని అందజేస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావునాయక్

వెల్దుర్తి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని తహసీల్దార్ కోటేశ్వరరావునాయక్, ఎంపీడీవో డి.ప్రసాద్‌లు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సచివాలయ సిబ్బందికి క్రీడా సామగ్రిని అందజేసి మాట్లాడారు. 15 సంవత్సరాలు నిండి క్రీడలపై మక్కువ ఉన్న వారు ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. ఈనెల 15 నుంచి క్రీడా పోటీలు సచివాలయాల పరిధిలో జరుగుతాయన్నారు. క్రీడా పోటీల నిర్వహణకు ఐదు రకాల క్రీడా సామగ్రిని అందజేయటం జరిగిందన్నారు. గ్రామీణ క్రీడాకారులలో నైపుణ్యాన్ని వెలికి తీయటానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. క్రీడాకారులలో నైపుణ్యాన్ని వెలికితీసి మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన వారు ఉన్నత స్థానానికి ఎదిగేలా ఈ క్రీడలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రాజశేఖర్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా ఆదినారాయణ, పులుసు నారాయణరెడ్డి, కేసిరెడ్డి నాగిరెడ్డి, సర్దార్‌నాయక్, తోట నారాయణ, దిబ్బా సియోను, తోట ఆంజనేయులు, మందా సీతారామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరమేశ్వరునికి అన్నాభిషేకం



సత్రశాలలో మల్లికార్జున స్వామివారికి అన్నాభిషేకం

సత్రశాల(రెంటచింతల): కై లాసనాథుడైన శివయ్యకు ఎంతో ప్రీతికరమైన కార్తీక మాసం చివరిరోజు మంగళవారం అతిపురాతన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థాన ప్రాగణం పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగింది. స్వామివారికి చేసిన అన్నాభిషేకం నిర్వహించారు. వేకువ జామునుంచే భక్తులు కార్తీక పుణ్యస్నానాలు చేసి, దీపాలు వెలిగించి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పాలువాయి జంక్షన్ శ్రీనివాస నర్సరీ నిర్వాహకులు శొంఠిరెడ్డి గురువారెడ్డి, వెన్నా శ్రీనివాసరెడ్డి, గుంటా నరేంద్రారెడ్డి భక్తులకు, మాలధారులకు అన్నదానం చేశారు. దేవస్థానం ఈవో బుర్రి నెమలి రెడ్డి, దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బాపనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సత్తెనపల్లికి బస్సు పునరుద్ధరించండి

డయల్ యువర్ డీఎంలో విన్నవించిన ప్రయాణికులు

సత్తెనపల్లి: అచ్చంపేట నుంచి ఉదయం 6:30 గంటలకు సత్తెనపల్లికి బస్సు ఉందని తరువాత 8:15 వరకు బస్సు లేదని గతంలో ఉన్న బస్సు ఇప్పుడు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, 7:40 గంటలకు బస్సును ఏర్పాటు చేయాలని అచ్చంపేటకు చెందిన ప్రమాణికుడు శ్రీనివాసరావు విన్నవించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు ఆయన ఫోన్ చేసి ఈ సమస్యను చెప్పారు. దీనికి డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ మాట్లాడుతూ మాదిపాడు రూటు రేషన్‌లైజ్ చేయనప్పుడు ఆ సమయంలో ఉండే బస్సు సర్వీస్ ప్రస్తుతం లేదన్నారు. బస్సు పునరుద్ధరించుటకు కృషి చేస్తామన్నారు. అచ్చంపేటకు చెందిన ప్రయాణికురాలు రమాదేవి మాట్లాడుతూ ఉదయం 6:30 గంటల తర్వాత 8.15 వరకు బస్సు లేదని గతంలో బస్సును పునరుద్ధరించాలని కోరగా డిపో మేనేజర్ సాధ్యమైనంత వరకు బస్సు ఏర్పాటు చేయుటకు కృషి చేస్తామన్నారు.

పంట నష్టం అంచనాల ప్రక్రియపై తనిఖీ



రాజుపాలెం(నకరికల్లు): నకరికల్లు మండలంలోని చల్లగుండ్ల, చీమలమర్రి, దేచవరం గ్రామాలలో పంట నష్టం అంచనాల ప్రక్రియను మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మంగళవారం తనిఖీ చేశారు. శనగ, కంది, తదితర పంటలు సాగు చేసి 33 శాతం కంటే ఎక్కువ నష్టపోయిన రైతుల పంటపొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు దిలీప్ కుమార్, కె.రవి బాబు, జి.జగదీష్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులకు గాయాలైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు, నూజెండ్లపల్లి మండలం, కొత్తనాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాదెండ్ల శ్రీనివాసరావు, భార్య రమణ, కుమారుడు మోహన్‌అభిమన్యు ఈ నెల 10న వ్యక్తిగత పనులపై గుంటూరు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు వద్ద వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రీకొడుకులకు గాయాలయ్యాయి. భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. 108 సాయంతో వీరిని నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనాల వేలం



రొంపిచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో మూడు వాహనాలకు రూ.53,725 రూపాయలు వెచ్చించి పాటదారులు పాడుకున్నారు. వేలంలో వాహనాలను పాడుకున్న వారికి వాటిని స్వాధీనం చేశారు. వేలం పాట కార్యక్రమంలో రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ పి.వి. రవీంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

బొల్లాపల్లి: మండల కేంద్రమైన బొల్లాపల్లి భవితా కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ అపర్ణ, సర్పంచ్ శిఖా జ్యోత్స్న, ఎంఈవో2, ఐఈఆర్‌పీ ఏడీ బాబు రావు, సుభాషిణి, ఫిజియోథెరపిస్ట్ ఎం. నాగరాజు, ప్రధానోపాధ్యాయులు అరుణ జాస్మిన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

15న విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు

నరసరావుపేట: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఈనెల 15వ తేదీ ఉదయం 9.30కు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు సీహెచ్.సువార్త మంగళవారం వెల్లడించారు. రన్నింగ్, షార్టుపుట్, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, చెస్ తదితర ఆటల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల విభిన్న ప్రతిభావంతులు పాల్గొని తమ నైపుణ్యాని ప్రదర్శించాలని కోరారు.

వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు



వైద్యశాలకు లక్ష్య ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

- అభివృద్ధి పథంలో సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాల
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఏరియా వైద్యశాలలో సీబీపీ యంత్రం ప్రారంభం

సత్తెనపల్లి: ప్రతి పేదవాడికి వైద్యం చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసి వైద్య రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం నిర్వహించిన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పూర్తి స్థాయిలో వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించే అధునాతన యంత్రాలు, ఆక్సిజన్ ప్లాంట్లు, పూర్తి కావచ్చిన అదనపు గదులు, ఇలా అన్ని విధాలుగా ఏరియా ప్రభుత్వ వైద్యశాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. జనవరి మొదటి వారంలోగా అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వైద్యశాలకు అవసరమైన వనరులు, వసతుల కల్పనపై అభివృద్ధి కమిటీ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు. రానున్న ఏడాదికి నూతనంగా ఎంపికైన అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రామకృష్ణ , పువ్వూరి శైలజలను సన్మానించారు. ఈ నెలలో ఉత్తమ సేవలందించిన ఎయిడ్స్ కౌన్సిలర్ రఘునాథ్, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన చోదకుడు ప్రవీణ్‌లను అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం అభివృద్ధి కమిటీ డైరెక్టర్, సామాజిక సేవకుడు కొత్త రామకృష్ణను సన్మానించి, అభినందనలు తెలిపారు. ముందుగా రక్త పరీక్షల కేంద్రంలో కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నాణ్యత ప్రామాణిక 'లక్ష్య' ధ్రువీకరణ పత్రాన్ని క్వాలిటీ మేనేజర్ రాంప్రసాద్ సమక్షంలో వైద్యశాలకు అందించారు. సమావేశంలో పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ గిరిజ, ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్లు తొలగించాలి

ఎన్నికల అధికారికి విన్నవించిన వైఎస్సార్‌సీపీ నేతలు

పెదకూరపాడు: ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, మరణాలు అధికంగా ఉన్నాయని, వాటిని తొలగించాలని వైఎస్సార్‌సీపీ నేతలు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, పెదకూరపాడు నియోజకవర్గ ఎన్నికల అధికారి నాగజ్యోతిని కలిసి కోరారు. మంగళవారం పెదకూరపాడు తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల అధికారి రాజకీయ నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ పెదకూరపాడు, బెల్లకొండ, క్రోసూరు, అచ్చంపేట, అమరావతి మండలాల్లో అత్యధికంగా డబుల్ ఎంట్రీలు, మృతులకు సంబంధించి ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని కోరారు. బీఎల్వోలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే వాటిని తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి పురుగుమందులు వాడొద్దు



మాట్లాడుతున్న విలోవుడ్ కెమికల్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ సీఎల్ రామరాజు

అమరావతి: రైతులు పురుగు మందుల వినియోగంలో పూర్తి అవగాహన లేకపోవడం వల్ల, ఒక్కొక్కసారి మోతాదుకు మించి పురుగు మందులు పిచికారీ చేయడంతో పంట దిగుబడి తగ్గిపోతోందని విలోవుడ్ కెమికల్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ సీఎల్ రామరాజు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మల్లాది గ్రామంలో విలోవుడ్ కెమికల్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో పురుగుమందుల వాడకం, పిచికారీ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రామరాజు రైతులకు అవగాహన కల్పిస్తూ పురుగు మందుల వినియోగం, పిచికారీ చేసేటప్పుడు అనేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నమ్మకమైన, ప్రభుత్వం సిఫార్సు చేసిన కంపెనీలకు చెందిన పురుగు మందులనే కొనుగోలు చేయాలని, అవసరం మేరకే మందులు పిచికారీ చేయాలన్నారు. మోతాదుకు మించి మందులు వినియోగిస్తే పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. గాలి వీచే దిశలోనే పిచికారీ చేయాలి. ప్యాకింగ్‌తో ఉన్న పురుగు మందులనే కొనుగోలు చేయాలి. పిచికారీ చేసేటప్పుడు ముఖాలకు మాస్కులు ధరించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు రూ.25 లక్షలు



సమావేశంలో ఎంపీపీ మేకల హనుమంతరావు

అమరావతి: మండలంలోని పదిహేను అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు నాడు-నేడు ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా నిధులు మంజూరయ్యాయని అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని, ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలలో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు మరమ్మతులకు నిధులు మంజూరు చేశారన్నారు. మహిళలు, శిశువుల సంరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు సుమారు రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయని, వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతుల పనులు జరగాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో మదర్స్ కమిటీలు వేయాలని, కమిటీకి అంగన్‌వాడీ వర్కర్ చైర్మన్‌గా వ్యవహరించి పనులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ హిమంబి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోరెడ్డి శివరామిరెడ్డి, మేకల శివశంకర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సెలవులు ఇవ్వాలి



నరసరావుపేట: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు పెయిడ్ హాలిడేస్, టెన్ ఇయర్స్ ఇన్సెంట్ ఇవ్వాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షులు ఎం.సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సమావేశం రాజశేఖర్ అధ్యక్షతన కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా డిసెంబర్ 18న డివిజన్ ఆఫీసుల వద్ద నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపు ఇచ్చారు. సబ్‌స్టేషన్ వాచ్‌మెన్‌లను ఫీల్డ్‌లో వాడుకోవటం వలన రాత్రిపూట డ్యూటీలో ఇబ్బంది కలుగుతుందన్నారు.